నవతెలంగాణ

1

ఆదిలాబాద్

గురువారం | డిసెంబర్ 19, 2024 | www.navatelangana.com

పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం

నవతెలంగాణ-జన్నారం

పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకమని ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ సుష్మారావు అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు గ్రామ జడ్పీ పాఠశాల విద్యార్థులు బుధవారం కవ్వాల్‌లోని గోండుగూడ తదితర అటవీ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు విద్యార్థులకు అడవులు, జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవులు, వన్యప్రాణులు ఉంటేనే పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ సాగరిక, ఎఫ్‌బిఓ లాల్బాయ్, రైముద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





సీఎం, మంత్రుల మాస్క్‌లతో ఉద్యోగుల నిరసన

నిర్మల్‌టౌన్ : సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదవ రోజుకు చేరుకుంది సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రుల ఫొటో మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

సమ్మె బాటలో సీఆర్‌టీలు..!

- ఉమ్మడి జిల్లాలో మూతపడిన ఆశ్రమ పాఠశాలలు
- ఉద్యోగ భద్రత, ఎంటీఎస్ వర్తింపజేయాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించే వరకు కొనసాగిస్తామని స్పష్టం
- పరీక్షల ముంగిట పాఠాలు కొనసాగక ఇబ్బందులు

ఏండ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు రెసిడెన్సియల్ టీచర్స్(సీఆర్‌టీ)లు సమ్మె బాట పట్టారు. గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు బడులకు వెళ్లేదిలేదని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఎదుట ఆందోళనకు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మినిమం టైమ్ స్కేల్(ఎంటీఎస్) వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని సీఆర్‌టీలంతా సమ్మెలో ఉండటంతో గిరిజన ప్రాథమిక పాఠశాలలు అనేకం మూతపడగా.. ఆశ్రమ పాఠశాలల్లోనూ సీఆర్‌టీలు లేకపోవడంతో పాఠాలకు అంతరాయం ఏర్పడుతోంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ..వివిధ సబ్జెక్టులు బోధించే సీఆర్‌టీలు అందుబాటులో లేకపోవడంతో రానున్న పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే సమగ్ర శిక్షా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో ఉండగా.. తాజాగా మూడు రోజులుగా సీఆర్‌టీలు సైతం అదేబాటను అనుసరించడంతో విద్యా కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో అనేక ఏండ్ల నుంచి కాంట్రాక్టు రెసిడెన్సియల్ టీచర్లు(సీఆర్‌టీ)లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న వీరి పట్ల ప్రభుత్వాలు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా విద్యా వ్యవస్థకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇది వరకే సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సమ్మె చేపట్టడంతో గత వారం, పది రోజులుగా కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో పాఠాలు నిలిచిపోగా.. విద్యాశాఖ కార్యాలయం పరిధిలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. తాజాగా ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలు సైతం అదే బాట పట్టడంతో గిరిజన ప్రాథమిక పాఠశాలలతో పాటు ఆశ్రమ స్కూళ్లలోనూ పాఠాలకు అంతరాయం ఏర్పడింది. ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న 600మంది స్కూల్ అసిస్టెంట్లు, మరో 600మంది ఎస్జీటీ సీఆర్‌టీలు విధులు బహిష్కరించారు. దీంతో గిరిజన విద్యా కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది. ఇప్పటికే ఉన్నత విద్య పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయగా.. ప్రాథమిక విద్య పరిధిలో పనిచేస్తున్న తమకు ఎందుకు వర్తింపజేయడం లేదని సీఆర్‌టీలు ప్రశ్నిస్తున్నారు.

స్పందించే వరకు సమ్మె..!

ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె బాటను వీడేదిలేదని సీఆర్‌టీలు స్పష్టం చేస్తున్నారు. సీఆర్‌టీలకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సర్వీసు క్రమబద్ధీకరించడంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన గ్రీన్ చానల్ వేతనాలు చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు. మహిళా సీఆర్‌టీలకు వేతనంతో కూడిన 180రోజులు ప్రసూతి సెలవులు వర్తింపజేయాలని, పిల్లల సంరక్షణ కోసం వేతనంతో కూడిన చైల్డ్‌కేర్ సెలవుల సౌకర్యం కల్పించాలని చెబుతున్నారు. 61ఏండ్లు నిండిన సీఆర్‌టీలకు రూ.20లక్షల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, ఆరోగ్యకార్డుల సౌకర్యాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆయా సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.



ఎంటీఎస్ మంజూరు చేయాలి : చవాన్ దేవిదాస్, సీఆర్‌టీ

ఆశ్రమ పాఠశాలల్లో గత 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్నాం. అరకొర వేతనాలు అందజేస్తున్నా గిరిజన విద్యార్థులకు విద్యనందిస్తున్నాం. జీతాలు కూడా సక్రమంగా రాలేకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి ఎంతో కష్టపడి పనిచేస్తున్నాం. కానీ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదు. తమకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయడంతో పాటు వివిధ సౌకర్యాలు కల్పించాలి.



వేతనాలు సక్రమంగా అందజేయాలి : సక్కుబాయి, సీఆర్‌టీ

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు ప్రతి నెలా క్రమంగా తప్పకుండా వేతనాలు అందించాలి. సమయానికి వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోపక్క మహిళా సీఆర్‌టీలకు వేతనంతో కూడిన చైల్డ్‌కేర్ సెలవులు వర్తింపజేయాలి. ఇబ్బందులు ఎదురైన సందర్భాల్లో డిప్యూటేషన్లు ఇచ్చి ఆదుకోవాలి.



ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం : యు.రమేష్,సీఆర్‌టీల సంఘం జిల్లా అధ్యక్షుడు

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టాం. మినిమం టైం స్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రస్తుతం విధించిన డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలి. గిరిజన విద్యార్థులకు విద్యనందిస్తున్న తాము అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది.

ఆకతాయిలపై కఠిన చర్యలు : ఏసీపీ ప్రకాష్



మంచిర్యాల : పట్టణంలో రాత్రి వేళ రోడ్లపై తిరుగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న యువకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి నుండి బుధవారం తెల్లవారుజాము వరకు పట్టణంలో ఆపరేషన్ చబుత్ర నిర్వహించారు. రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతూ వాహనాలతో పెద్ద సౌండ్‌లు చేస్తూ అల్లర్లు సృష్టించే ఆకతాయిల కోసమే ఆపరేషన్ చబుత్ర ఏర్పాటు చేశామన్నారు. యువకులు, పట్టణ వాసులు రాత్రి వేళల్లో అనవసరంగా బయటకు వచ్చి సమస్యలు కొని తెచ్చుకోవద్దని, రాత్రి వేళల్లో రోడ్లపై ఇష్టానుసారంగా తిరిగినట్లైతే పోలీస్ కస్టడీకి తీసుకొని కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. యువత మంచి మార్గంలో నడవాలని, పిల్లలు చెడు తోవ పట్టకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొన్ని రోజుల పాటు పట్టణంలో ఆపరేషన్ చబుత్ర కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌రావు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

జన్నారం : గల్ఫ్ కార్మికులకు రూ. 500కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. బుధవారం అంతర్జాతీయ వలస కార్మికుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వలసదారుల సంక్షేమం కోసం ప్రతి ఏటా 500 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 41 ఏళ్లుగా ఎటువంటి సవరణలూ లేకుండా వలస కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల చిరకాల వాంఛ గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. రూ.500 కోట్లతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న కార్మికుల కోసం లీగల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ గల్ఫ్ కార్మికులు సంక్షేమ సమితి రాష్ట్ర ఇన్‌చార్జి ఎరుకల రాజుగౌడ్, రాష్ట్ర కోశాధికారి అమరకొండ మల్లేష్, దుబాయ్ శాఖ అధ్యక్షులు మమ్మద్ అలీమ్, బార్ దుబాయ్ కోఆర్డినేటర్ కూనారపు రమేష్, ధర్మాజీ సత్తన్న, సురేష్, వినోద్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో పోటీతత్వం



నిర్మల్‌రూరల్: టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో అన్ శ్రుత రెసొనెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంతకు ముందు జిల్లాలోని వివిధ మండలాలలో నిర్వహించిన మండల స్థాయి పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బుధవారం జిల్లా స్థాయి బయో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సిద్ధ పద్మ, రెసొనెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ లావణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచి పెంచుకోవడం వల్ల చక్కని భవిష్యత్ నిర్మించుకోవచ్చుని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 28న జరిగే రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య, సలోమీ కరుణ, ప్రవీణ్, లింబాద్రి, జిల్లా సైన్స్ అధికారి వినోద్, జిల్లా బయో సైన్స్ ఫోరం అధ్యక్షులు సత్తెన్న, కార్యదర్శి సుష్మా రాణి, గౌరవ అధ్యక్షులు మోహన్‌రావు, గంగా సురేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

జన్నారం : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని ఎల్వి ప్రసాద్ నేత్రాలయ బ్రాంచ్ జూనియర్ అడ్మిన్ జయరాజు అన్నారు. బుధవారం ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌లో 35,796 మంది పరీక్షలు చేసుకున్నారన్నారు. అందులో నుంచి ఆదిలాబాద్ ఎల్వి ప్రసాద్ బ్రాంచ్‌కి 5168 మందిని పంపించి శస్త్ర చికిత్సలు అందించామన్నారు. 13063 మందికి కళ్లద్దాలు రిఫర్ చేయగా 1625 కళ్లద్దాలను తీసుకున్నారన్నారు. కళ్లు సక్రమంగా ఉంటేనే ప్రకృతిని, ప్రపంచాన్ని చూడగలమన్నారు. అన్ని అంగాలలో కళ్లు ప్రధానమైనవని తెలిపారు. కళ్లను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ లక్ష్మణ్, నేత్ర వైద్యశాల విజన్ తెరపిస్ట్ నిఖిల్, మానస డాటా ఎంట్రీ నరేష్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ పాఠశాలగా కిష్టాపూర్

జన్నారం: పాఠశాలలో సాధించిన ఉత్తమ ఫలితాలకు మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.నరసింహారెడ్డి చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, మండల విద్యాధికారి విజయకుమార్, ఎస్‌ఓలు చౌదరి, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్‌రావు, మధు బాబు, రాజ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మంగ, పలువురు గ్రామస్తులు అభినందించారు. పాఠశాలను ఇదే విధంగా అభివృద్ధి పథంలో నడిస్తామని ప్రధానోపాధ్యాయుడు రాజన్న పేర్కొంటూ డీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి

బోథ్ : పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన వారికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలనీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. బుధవారం మండలంలోని ధన్నూర్-బి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టబోతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ ఇంటి సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్సీ ఎస్టీలకు ఇంటి నిర్మాణానికి ఆరు లక్షలు, మిగతా వారికి ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాజిద్ అలీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎల్మ వినయ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ వార్డ్ నెంబర్ 44, 49లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. నమోదు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలని, రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నేటి వరకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేశారు, సర్వే సందర్భంగా యాప్ ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్ మొబైల్ యాప్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా ఈ నెలాఖరులోగా సర్వే పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సివిఎస్ రాజు, సర్వేయర్‌లు ఉన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే దేన్నైనా సాధించగలం

- జిల్లా వైద్యరోగ్య శాఖధికారి డా.నరేందర్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్యంగా ఉంటేనే దేనినైనా సాధించగలుగుతామని, ఆరోగ్యంగా ఉండటం అంటే జ్వరం లేకుండా ఉండడం కాదని శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండటమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్వైజర్లకు ఒకరోజు సమావేశం నిర్వహించారు. పరిశుభ్రత, పారిశుధ్య వద్ధతులను ప్రోత్సహించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు పాటించవలసిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈనాటి పాఠశాల పిల్లల్లో శారీరక శ్రమ లోపించిందని, దానితో వారిలో చిన్నతనంలోనే ముసలితనం ఛాయలు రావడం, బరువు పెరగడం, తొందరగా వెంట్రుకలు తెల్లబడడం జరుగుతున్నాయని పేర్కొన్నారు. శారీరక శ్రమను పెంచే ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, రన్నింగ్ క్రికెట్, హాకీ లాంటి ఆటలు ఆడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఒకే చోట కూర్చొని ఆడే ఇండోర్ గేమ్‌లను టెలివిజన్, లాప్టాప్, మొబైల్ ఫోన్లు పరిమితం కాకుండా చూడాలని తెలిపారు. అసంక్రమిత వ్యాధులలో తొలి రెండు స్థానాలు ఆక్రమించిన గుండెపోటు, చక్కర వ్యాధిని నియంత్రించాలంటే శారీరక శ్రమతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. పిజ్జాలు, బర్గర్లు పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. శరీరానికి అవసరమైన మైక్రో న్యూట్రిషన్ లెహ విరివిగా తీసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ వంశీ పిపిటీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సాధన, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా టిబి ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సుమలత, ఎస్‌ఓ సుజాత్‌ఖాన్, జిల్లా లెప్రసీ ఆఫీసర్ డా.గజానంద్, డిఎంఓ సహ ప్రముఖ నిపుణులు డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు నమోదు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మథ్, అర్లి-గోడిసెర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు బుధవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలో ప్రజాపాలనలో భాగంగా 9,188 దరఖాస్తులు వచ్చాయని, గ్రామానికి వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీవో సోలమాన్ రాజ్‌తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు గంగాధర్, మాధవి ఉన్నారు.



ఆదివాసులను ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వన్యప్రాణులను వేటాడరని అమాయక ఆదివాసులను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు గోడం గణేష్ అన్నారు. ఆదివాసిని భయభ్రాంతులకు గురిచేసి చెయ్యని తప్పుకు ఒప్పుకునేటట్టు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడిన ఫారెస్ట్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని కార్యాలయంలోనికి వెళ్లకుండా గేట్లను మూసి వేశారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మేకల కాపరి మడావి రామకృష్ణని అటవీ జంతువును వేటాడని తీసుకొచ్చి నీరు, ఆహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. అటవీని కాపాడకుండా అమాయక ఆదివాసులను పట్టుకుంటున్నారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారితో పాటు ఎస్ఆర్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసులపై చిరుత పులి, పెద్దపులి దాడి మరోవైపు ఫారెస్ట్ అధికారుల దాడులు జరుగుతున్నాయన్నారు. సిరికొండ ఘటనపై ఎస్ఆర్ఓ గులాబ్ సింగ్ వివరణ ఇస్తూ మేకల కాపరి నీలుగాయిని వేటడాడని తమకు అజ్ఞాత వ్యక్తి సమాచారం ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే మడావి రామకృష్ణని విచారణ నిమిత్తం తీసుకు వచ్చామన్నారు. విచారణలో జగన్నాథ్ అనే వ్యక్తి స్టేట్మెంట్ తీసుకున్నామని తెలిపారు. విచారణ సమయంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళనలు చేయడం సరికాదన్నారు. బలవంతంగా ఎవరిపై కూడా కేసులు నమోదు చేయమని స్పష్టం చేశారు. విచారణలో తప్పు చేసిన వారిపై చర్యలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, కొలాం సంఘం రాష్ట్ర నాయకులు సోనేరావ్, జిల్లా విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు వరుణ్, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు భుజంగ్‌రావ్, మండల అధ్యక్షులు ముకుంద్, మడావి బాపురావు, మేస్రం దినేష్, గేడం ఆనంద్ పాల్గొన్నారు.

కవ్వాల్ ఫారెస్ట్‌లో ఏజీ బృందం సభ్యుల పర్యటన



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్‌లో అడ్వకేట్ జనరల్ కార్యాలయ బృందం సభ్యులు కవ్వాల్ అభయారణ్యంలో పర్యటించారు. బుధవారం గోండుగూడ, బైసన్‌కుంట తదితర అటవీ క్షేత్రాలను పరిశీలించారు. అడవిలో అధికారులు పెంచుతున్న గడ్డి క్షేత్రాలను కూడా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ కార్యాలయ అధికారులు పంకజ్, విజయవర్మ, స్థానిక అటవీ అధికారులు పాల్గొన్నారు.

20న పట్టుబడ్డ వాహనాలకు బహిరంగ వేలం

నిర్మల్‌టౌన్: డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేసున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎండి. రజాక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న శుక్రవారం ఉ 10గంటలకు వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఎక్సైజ్ స్టేషన్లో బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్



దేశంలో ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడంలో ప్రధాన భూమికను పోషిస్తున్న బడా ఆర్థికవేత్త ఆదాని ఆర్థిక అవకతవకలు, మణిపూర్ హింసాత్మక ఘటనలపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడం, అదానిని అరెస్ట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెక్స్ రోడ్డు నుండి రాజ్ భవన్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ ర్యాలీలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద చేపట్టిన నిరసనలో రోడ్డుపై బైఠాయించారు. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి డా. సాగర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంగాధర్ గుడిసెరా, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్ గడిచందా, కోశాధికారిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా భూపేష్ పొట్టిపెల్లి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్, సలహాదారులుగా రతన్, రాజేశ్వర్, రాంప్రసాద్, సుభాష్, ప్రవీణ్, సంజీవ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పీఎంపీ, ఆర్ఎంపీల వైద్యుల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో మండల పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం మూడవ రోజు కొనసాగుతున్న సీఎం కప్ పోటీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ సీఎం కప్ పోటీలు దోహదపడతాయన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ తత్వం ఉండాలన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. క్రీడాకారులంతా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి, రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో స్థానం సంపాదించాలని ఆకాంక్షించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతున్న పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, క్రీడాకారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

మధ్యాహ్న భోజన కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని, సకాలంలో బిల్లులు చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు, వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారని, అప్పులు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే మెనూకు ఇప్పుడున్న మెనూ చార్జీ ఏమాత్రం సరిపోవటం లేదని, మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చే గుడ్డు ధర రెండు గుడ్లకే సరిపోవటం లేదని మూడో గుడ్డు పెట్టాలని ప్రధానోపాధ్యాయులు, రాజకీయ నాయకులు కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. చేతకాకుంటే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మాదిరిగా ప్రభుత్వమే నేరుగా అన్ని పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పథకం ప్రారంభించిన నాటినుండి శ్రమదోపిడికి గురవుతున్నారని, శ్రమకు తగ్గ ఫలితం కనీస వేతనం రూ.26 వేల నిర్ణయించి అమలు చేయాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రూ. పది వేల వేతనం ఈ బడ్జెట్ సమావేశాల్లో జీఓ విడుదల చేసి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. రాధ మాట్లాడుతూ కార్మికులు పథకం ప్రారంభ దశ నుంచి కట్టెల పొయ్యిపై వంట చేయడం వలన కండ్లకు పొగసూరి కండ్లు, పొయ్యిలో మంట ఊదిఊది ఊపిరితిత్తుల సమస్యతో అనేక మంది ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. ప్రభుత్వం ఆలోచన చేసి కార్మికులకు వంటకు సరిపడా గ్యాస్ సిలిండర్ పూర్తిగా ఉచితంగా ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు, గుర్తింపు కార్డులు, ప్రోసిడింగ్ ఆర్డర్స్, కాటన్ దుస్తుల డ్రెస్ కోడ్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజులలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈనెల 21 నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు వంట బంద్ చేసి సమ్మెకు చేపట్టనున్నట్టు డీఈఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, సత్యవాని, గంగధర్, విజయ, భాను, పద్మ, సవితభాయ్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

బయోసైన్స్ సబ్జెక్టుపై మక్కువ పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు బయోసైన్స్ సబ్జెక్టుపై మక్కువ పెంచాలని డీఈఓ ప్రణిత అన్నారు. తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు జిల్లా స్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. తాము చదువుకునే రోజుల్లో బయోసైన్స్‌లో కేవలం పటాలు గీసి చెప్పేవారని, కానీ ప్రస్తుతం ప్రయోగత్మకంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారన్నారని వివరించారు. జీవితంలో బయోసైన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. భవిష్యత్తులో వైద్యులు కావాలని అనుకునే వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు రాంనాథ్, రమణారావు, రాజు ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షణకు వాకింగ్ చేయాలి

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వృద్ధాప్యం కారణంగా అనేక దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని వాటి నుంచి రక్షణ పొందేందుకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉంటారని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. హెల్పేజ్ ఇండియా సహకారంతో వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో రిమ్స్ వయోవృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్‌తో పాటు ఏసీడీపీఓ మిల్కా ముఖ్య అతితులుగా హాజరయ్యారు. అతిథులతో పాటు వైద్యులను సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని, వృద్ధులు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వయస్సు పైబడిన క్రమంలో బీపీ, షుగర్ లాంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్పాండే, వైద్యులు కస్తూరి శ్రీనివాస్, సందీప్ జాదవ్, ఓం ప్రకాష్, విజయ్మాహన్, వయోవృద్ధుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- పెరుగుతున్న చలి
- పాఠశాల సమయంలో మార్పులు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- నేటి నుంచి అమలు : డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం పది గంటలు దాటిన చలి ఉంటుంది. ఈ క్రమంలో పాఠశాలలకు వేళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాలల సమయాల్లో మార్పులు చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ, ఆయా పార్టీల నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతులు అందించారు. కలెక్టర్ రాజర్షి షా స్పందించి చలి తీవ్రత దృష్ట్యా పాఠశాలల సమయాల్లో మార్పు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చలి తీవ్రత తగ్గే వరకు ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలు ఈ సమయాలను పాటించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

పాఠశాల సమయవేళల్లో మార్పులు..

జిల్లాలో చలి తీవ్రత దృష్ట్యా పాఠశాలల సమయాల్లో మార్పులు చేసినట్లు డీఈఓ ప్రణీత పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మార్పులు చేసినట్లు, ఉత్తర్వుల కాపీలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రయివేట్ పాఠశాలల యాజమన్యాలకు తెలిపినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పాఠశాల సమయ సారిణి ఉంటుందని, గురువారం నుంచి అమలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

యోగాతో నిత్య జీవితంలో ఆరోగ్యం



నవతెలంగాణ-బోథ్

ఆరోగ్యంగా ఉండాలంటే యోగను తప్పనిసరి చేయాలని యోగ శిక్షకులు మునిగేలా యోగిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక యోగ శిక్షణా ఆసానాల గురించి తెలియజేసి వేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుమ్మరి పోశెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కామన్ మెనూ అమలు కష్టం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వం తీసుకువచ్చిన కామన్‌మెనూ అమలు కష్ట తరంగా ఉందని టీఎన్జీఓస్ అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్ అన్నారు. బుధవారం టీఎన్జీఓ అనుబంధ సంఘం హెచ్‌డబ్ల్యూఓ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏఓ, బీసీ అభివృద్ధి అధికారి, జిల్లా సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ అధికారులకు వేరువేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కొక్క వసతి గృహాలకు ఒక విధంగా మెనూకు నిధులు ఉంటాయన్నారు. కొత్త కామన్‌మెనూ ప్రకారం అమలు చేయడం కష్టతరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం కామన్‌మెనూ అమలుతోపాటు నిధులను కూడా పెంచాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ కార్యదర్శి కూడల రవికుమార్, హెచ్‌డబ్ల్యూఓ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ రాజు, వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాసర గోదావరిని పరిశీలించిన ఎస్పీ



నవతెలంగాణ-ముధోల్

భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర పుణ్యక్షేత్రంలో గల గోదావరి నదిలో తరచు ఆత్మహత్యలు జరుగుతుండటం నిర్మల్ ఎస్పీ జానకి షర్మిలను కదిలించాయి. బుధవారం భైంసా ఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్‌తో కలిసి బాసర గోదావరి బ్రిడ్జి, స్నానపు ఘాట్లను పరిశీలించారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు, బ్రిడ్జి సైడ్‌వాల్ ఎత్తుగా లేకపోవడంతో గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. బ్రిడ్జి సైడ్‌వాల్‌కు ఇనుప కంచె ఎత్తుగా బిగించాలని పోలీసులు నిర్ణయించారు. అయితే ఈ బ్రిడ్జి నిజామాబాద్, నిర్మల్ జిల్లాకు పరిధిలో ఉండటంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సమన్వయంతో ఇరుపక్కల బ్రిడ్జికి ఇనుప కంచె ఏర్పాటు చేస్తామని ఎస్పీ ప్రకటించారు. ఆత్మహత్యలను నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులతో సమీక్షించారు. అలాగే బ్రిడ్జి దగ్గర, స్నానపు ఘాట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి బాసర పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. గోదారి బ్రిడ్జి వద్ద, స్నానపు ఘాట్లుల వద్ద మహిళా కానిస్టేబులను నియమిస్తామన్నారు. నిరంతరం పోలీసులు పెట్రోలింగ్ కొనసాగాలని సూచించారు. ఆత్మహత్యల నివారణకు ఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పిల్లలు చెడు వ్యాసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని దారుల్ అన్సార్ వెల్ఫర్ సొసైటీ కరీంనగర్ ప్రతినిధి సయ్యద్ రిజ్వాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సొసైటీ ఆధ్వర్యంలో భిన్నత్వంలో ఏకత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చలితీవ్రత దృష్ట్యా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని సయ్యద్ రిజ్వాన్ తెలిపారు. మతం కంటే మానత్వం గొప్పదన్న సూత్రాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని కోరారు. ప్రస్తుత కాలంలో యువత చెడు వ్యాసనలకు అలవాటు పడుతోందని, దాని వల్ల కలిగే అనార్ధాలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించి వాటికి దూరంగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు డాక్టర్ ఖుద్దూస్, ఖాజీ నదిమోద్దీన్, ఫైసల్, ఆరీఫ్, ఖిజర్ యాఫై, అస్మాత్ అలీ, షేక్ మోయిస్, న్యాయవాధి భావన, బండారి దేవన్న, చర్చ్ ఫాదర్ రాకేష్ పాల్గొన్నారు.

మావల పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐ ఫణిదర్, మావల ఎస్ఐ వి.విష్ణువర్ధన్, ఎస్పీకి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. స్టేషన్ సిబ్బంది ఏర్పటు చేసిన డ్రిల్, స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రిసెప్షన్, సాంకేతిక నిపుణుల పనితీరు, ఉమెన్ హెల్ప్ డెస్క్, సిబ్బంది వేచి ఉండే గది, స్టోర్ రూమ్, రికార్డు రూమ్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. స్టేషన్‌లో ఇప్పటివరకు నమోదైన సైబర్ క్రైమ్ బాధితుల వివరాలు, సీఈఐఆర్ ద్వారా తిరిగి అందించిన మొబైల్ ఫోన్ల వివరాలు, ఫింగర్ ప్రింట్, డ్రంక్ అండ్ డ్రైవ్, సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కిట్లు, కేసు హిస్టరీ సీట్లు, రౌడీ షీట్లు, ఫైవ్ ఎస్, రికార్డుల నిర్వహణ, డయల్ హండ్రెడ్, పెట్రో కార్, బ్లూ కోర్ట్, రౌడీ షీట్లు తదితరాలపై పూర్తి విచారణ చేపట్టారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటిని అరికట్టాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పవర్ గౌతమ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట పీడీఎస్యూ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్న కారణంగా పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చదువులు పూర్తయిన విద్యార్థులకు ఫీజులు రాని కారణంగా కళాశాలల యాజమన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. దీంతో వారు పై చదువులు చదవలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని, వసతి గృహాల్లో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేందర్, మారుతి, శ్రీకర్, దీపలక్ష్మి, హరీష్, దత్తాత్రి పాల్గొన్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన నూతన వచ్చిన సీఐ వెంకటేశ్వర్‌ను బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక సమస్యలపై చర్చించి మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, వీడీసీ అధ్యక్షులు గట్ల గంగాధర్, నాయకులు షేక్ షాకీర్, షేక్ మహమ్మద్, రాజు, సాయన్న, ఉమేష్, హసీబ్, షహీద్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | డిసెంబర్ 19, 2024 | www.navatelangana.com

నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

నవతెలంగాణ-దహెగాం



మెడికల్ ఏజెన్సీ, దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అశ్విని అన్నారు. బుధవారం మండలంలోని బిబ్రా, ఐనం, దహెగాం తదితర గ్రామాలలోని మెడికల్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపట్టొదన్నారు. ప్రతి మెడికల్ దుకాణంలో ఫార్మసిస్టు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎనిమిది మందికి నెల రోజుల జైలు

నవతెలంగాణ-వాంకిడి

కులాంతర వివాహాన్ని చేసుకున్నందుకు కుల బహిష్కరించిన కేసులో ఎనిమిది మంది కుల పెద్దలకు నెల రోజుల పాటు జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ స్పెషల్ పీసీఆర్ కోర్ట్ ఆదిలాబాద్ జడ్జి టి.దుర్గారాణి తీర్పు ఇచ్చారు. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంనగర్‌కు చెందిన నౌగడే ఆత్మారాం కుమారుడు కులాంతర వివాహాన్ని చేసుకున్నాడు. వారిని నాలుగు సంవత్సరాల పాటు కుల బహిష్కరణ చేస్తూ వారి కుల పెద్దలు నౌగడే దాదాజీ, నౌగడే బాబురావు, నౌగాడే బాహుజీ, చాఫ్లె సీతారాం, చౌదరి బిజ్జి, నౌగడే రమేష్, నౌగడే పెంటు, లోనారే నాందేవ్‌పై 8 మే2020లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్ఓ డి.రమేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పిపి నవీన్ సాక్షులను కోర్టులో హాజరుపరచగా జడ్జి విచారణ జరిపి నేరం చేసినట్టు రుజువు కావడంతో నిందితులకి పై శిక్ష విధిస్తు తీర్పు వెలువరించారు. కేసులో నిందితులకి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రశాంత్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఈశ్వర్ సింగ్, కోర్ట్ సిబ్బందిని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అభినందించారు.

చదువుతోనే ఆదివాసుల అభివృద్ధి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చదువుతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరు చదువుపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. సిర్పూర్(యు) మండలం పవర్‌గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా వాసవి క్లబ్ సహకారంతో పేద ఆదివాసీ మహిళలు, వృద్ధులకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో పిల్లలను పాఠశాలకు పంపాలని, ఆదివాసుల అభివృద్ధికి పోలీసు శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. యువత ముఖ్యంగా మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించి తమ కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. గంజాయి నిర్మూలనలో పోలీసులకు సహకరించాలన్నారు. పోలీసులకు సమాచారం అందించడానికి 100, ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేసి తెలియజేస్తే నష్టపోయిన సొమ్మును తిరిగి వచ్చే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, జైనూర్ సీఐ రమేష్, గ్రామాల ప్రజలు, ఆదివాసులు, పటేళ్ళు, సర్మేడిలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని సమాజంలో అందరితో సమానంగా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వాలు పని చేస్తున్నాయని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రవి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్ బెంగాల్ క్యాంపులో ప్రభుత్వ నిధుల ద్వారా మంజూరైన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందించాలని ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శిశుదశ నుంచే విద్య, శారీరకంగా, మానసికంగా ఎదగాలని లక్ష్యంతో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా పౌష్టిక ఆహారంతో పాటు ఆరోగ్యపరమైన సేవలు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, మండల అధ్యక్షులు చౌదరి తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సమీర్, తిరుపతి, శంకర్, మాజీ జడ్పీటీసీ రాం నాయక్, సీనియర్ నాయకులు ఫైసల్ బిన్ సులేమాన్, నాయకులు కోండు శంకర్, శేఖర్, మారుతి పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 8 రోజులుగా కలెక్టరేట్ ఎదురుగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా 9వ రోజు మానవహారంతో నిరసన తెలిపారు. సమ్మెకు మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్ మద్దతు తెలిపి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పీసీసీ అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చుకోవాలన్నారు. 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న వీరికి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఖమ్మంలో గుండెపోటుతో మరణించిన సీసీఓ హేమకు నివాళులర్పించారు. మద్దతు తెలిపిన వారిలో రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు గుర్రాల వెంకటేశ్వర్, నాంపల్లి శంకర్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, ఆసిఫాబాద్, రెబ్బెన మండల విద్యాధికారులు రాథోడ్ సుభాష్, వెంకటేశ్వర్లు, ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు శృతిక, గౌరవ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షురాలు నాగసుధ, ప్రధాన కార్యదర్శి తుకారం, సంఘం జిల్లా కోశాధికారి నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, ప్రత్యేకాధికారినిలు అరుణ, మీనా, సీసీఓ సంఘం జిల్లా అధ్యక్షులు అనూప్ మహేష్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీఆర్పీ అధ్యక్షుడు పవన్, రాజేష్, పీజీసీఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, తిరుపతి, శివరాం, ప్రసన్న స్వప్న సరస్వతి, సునీల్, సతీష్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులను చదువులో తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థుల ను చదువులో తీర్చి దిద్దాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ, ముత్తంపేట్, బీవరేటీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో మంచి ప్రతిభ కనబరిచేలా చూడాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.



ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మానిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. బుధవారం కాగజ్‌నగర్‌లో జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతకుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా 5వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రావడానికి మాత్రమే కాదని వచ్చిన తర్వాత అమలు చేయాల్సిన బాధ్యత కూడా ఉంటుందన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత ఫెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 4 వాయిదాల కరువు భత్యాలను విడుదల చేయాలని, తెలంగాణ రెండవ పీఆర్సీ నివేదిక తెప్పించి, మెరుగైన ఫిట్మెంట్‌తో జులై 2023 నుండి అమలు చేయాలన్నారు. కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి జి శ్రీధర్ మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లోని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేయాలి, ప్రాథమిక విద్య బలోపేతానికి నర్సరీ తరగతులు, కేజీ తరగతులు ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని, మధ్యాహ్న భోజన ధరలను పెంచాలి, నెలనెలా బిల్లులు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిటైర్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. తొలుత జాతీయ పతాకాన్ని ప్రభాకర్, ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని శాంతికుమారి, సంఘ పతాకాన్ని ఊశన్న ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, ఆనంద్, కాగజ్‌నగర్ ఎంఈఓ ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందూరావు, హేమంత్, ప్రీతి, రమేష్, ఊశన్న, రాజకమలాకర్ రెడ్డి, దుర్గయ్య, మీనా, హరీశ్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ ఆసిఫాబాద్

జిల్లాలోని ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి ఆదివాసీ నాయకులు, సర్‌మెడీలు, పటేళ్లతో జిల్లాలోని 15 మండలాలలో గల గిరిజన గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, రహదారులు, వంతెనల నిర్మాణాలు, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలకు రవాణ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ దిశగా అటవీశాఖ అనుమతులకు ప్రతిపాదనలు సమర్పించి సంబంధిత అనుమతులు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, గ్రామాలలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలల భవనాలు, ఉప కేంద్రాల నిర్మాణ పనులు, ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. గిరి గ్రామాల్లో నెట్‌వర్క్ సేవలను మెరుగుపరిచేందుకు మారుమూల గ్రామాలలో మొబైల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా మారుమూల గ్రామాల ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు అధికారులు కృషి చేయాలని, అవసరం ఉన్నచోట రాయి సెంటర్లు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్యగల భూ వివాదాలను పరిష్కరించేందుకు జాయింట్ సర్వే నిర్వహించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోడు భూములలో సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులను గుర్తించి పోడు పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని, గిరిజనుల వ్యవసాయ రంగ అభివృద్ధి దిశగా గిరి వికాసం పథకం క్రింద బోర్లు, విద్యుత్ కనెక్షన్లు అందించడంతో పాటు గిరిజన ప్రాంతాలలో విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీల ప్రకారం నూతన మెనూ అమలు చేస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆదివాసీ గ్రామాలలో చారిత్రాత్మక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వరి జోషి, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా సంరంభం ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ మండల స్థాయి పోటీలు ముగించుకుని జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ బాలికల పాఠశాల మైదానంలో జిల్లా యువజన క్రీడల అధికారిణి రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీఎం కప్-2024 పోటీలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలో జిల్లాను మంచి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయన్నారు. 18 సంవత్సరాల వయసు ఉన్న గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజేతగా నిలిచి దేశానికే గర్వకారణంగా నిలిచాడన్నారు. క్రీడలు స్నేహభావంతో పోటీలలో పాల్గొనాలని, ప్రత్యర్థి జట్టులోని క్రీడాకారులను గౌరవించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలలో జిల్లాలోని 15 మండలాలు, రెండు మున్సిపాలిటీల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని, రెండు రోజులపాటు క్రీడలు జరగనున్నట్టు తెలిపారు. వీటిలో గెలుపొందిన వారు ఈనెల 27 నుండి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మొదటిరోజు అథ్లెటిక్స్‌తో పాటు వాలీబాల్, ఫుట్ బాల్, చెస్, యోగ పోటీలు నిర్వహించగా దాదాపు 1000 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజివి, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, టీడబ్ల్యూటీయూ అధ్యక్షులు రవీందర్ రాథోడ్, ఎస్జీఎఫ్ సెక్రటరీ వెంకటేష్, చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉపేందర్, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ధర్మారావు, పీడీ పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, తిరుమల్, జిల్లాలోని వ్యాయమ ఉపాధ్యాయులు మధుసూదన్, విద్యాసాగర్, లక్ష్మణ్, భాస్కర్, మంగవతి, షేకు, బిక్కు, వినోద్, సత్యనారాయణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలం వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. సమ్మేటివ్ అసెస్మెంట్‌కు సంబంధించిన 10వ తరగతి విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి, భౌతిక శాస్త్రంలో వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా సాధన చేయాలని, ప్రత్యేక తరగతులలో విద్యార్థులు తమకు కలిగిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని, అప్పుడే 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. అభ్యాస దీపికలలో ఇచ్చిన ప్రతి ప్రశ్నను సాధన చేయాలని, వార్షిక పరీక్షలను ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, అధికారులున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆస్పత్రిలోని వార్డు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందించే భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న వైద్య సేవలు, భోజనం ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి పర్యవేక్షకులు కేశవరావు, ఎంపీడీఓ సత్యనారాయణ, డా.అనూష, సంబంధిత అధికారులున్నారు.

సేవా కార్యక్రమాల్లో ఎస్పీఎం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సామాజిక సేవ కార్యక్రమాల్లో ఎస్పీఎం ముందుకు రావడం అభినందనీయమని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. బుధవారం ఎస్పీఎం యాజమాన్యం ఆధ్వర్యంలో దివ్యాంగులకు మూడు చక్రాల బ్యాటరీ వాహనాలను అందించారు. దీనికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీఎం యజమాన్యం చేస్తున్న కార్యక్రమాలు చాలా అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరి ఎన్నో జరపాలని, దానికి తమ తరఫున ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. యూనిటెడ్ ఏకే మిశ్రా మాట్లాడుతూ యజమాన్య ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా మెడికల్ క్యాంపు పేద విద్యార్థులకు బుక్స్ స్కూల్ బ్యాగ్స్, మెడికల్ క్యాంపులో మందులు వారికి అవసరమైన పరీక్షలు చేయడం, గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు కుట్టు మిషన్ కేంద్రాలు, కంప్యూటర్ ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మిల్లు జనరల్ మేనేజర్ ఎమ్మెస్ గిరి, చీఫ్ మేనేజర్ రమేష్ రావు, మిల్లు హెచ్ఓడీ మేనేజర్ శశికాంత్ బోడే, నాగరాజు, తుమ్మ రమేష్, వర్క్ కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, శివ ప్రసాద్, రాజేందర్ పాల్గొన్నారు.

నేటి నుండి వేతనాల పెంపుకు నిరసనలు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని గురువారం నుంచి మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న అన్నారు. బుధవారం గోలేటి సివిల్ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. ఈనెల 19, 20, 21 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ప్లే కార్డ్స్‌తో నిరసన కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, 30శాతం పీఆర్సీ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలలో కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేసిందని, కాని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయలేదన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందాలను అమలు చేయడంలో జాతీయ కార్మిక సంఘాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మూడు రోజుల పాటు ప్లే కార్డ్స్‌తో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బందు అశోక్, తిరుపతి, గోలేటి శ్రీను, అరికిల్ల పోచం, భీమేష్, లింగయ్య, సావిత్ర, శంకరమ్మ, తార, మల్లేశ్వరి, కమల, విజయ, లలిత, సునీత పాల్గొన్నారు.

జనజీవన స్రవంతిలోకి రండి

- డీఎస్పీ రామానుజం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మావోయిస్టులు అడవిని వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. గురువారం మండలంలోని అగర్‌గూడ గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు పోరుకన్న ఊరుమిన్న అనే కార్యక్రమంలో భాగంగా అగర్‌గూడ గ్రామానికీ చెందిన చౌదరి అంకుబాయి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉండి సాధించేదేమీలేదని, లొంగిపోతే పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించేందుకు పోలీసు శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. అజ్ఞాతంలో ఉంటూ ఎంతో కాలంగా కుటుంబాలకు దూరంగా ఉండి సాధించేదేమీలేదనీ, ప్రజలందరూ ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నారని, ఆయుధాలు వీడి స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు అందజేస్తున్న రివార్డులతో పాటు ఐదెకరాల భూమి, ఆటో లేదా ట్రాక్టర్ జీవనోపాధి కల్పనకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల అభివృద్ధి కోసం పోలీసు శాఖ ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ కృషి చేస్తుందని, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేస్తామన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు, పెంచికల్‌పేట్ ఎస్ఐ కొమురయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో జూనియర్ విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆత్రం ధర్మారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆత్రం లింగారావు, కార్యదర్శి ఆత్రం ధర్మారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన జట్లు బాలికలు ఈనెల 22 నుండి 25తేదీ వరకు హకీంపేట్ శమీర్ పేట్ జిల్లా మేడ్చల్ మల్కాజిగిరిలో, బాలురకు 27నుండి 30 ప్రెస్టన్ పాఠశాల మైదానం, జనగాంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 20న ఉదయం 11 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో, రూ.100 ప్రవేశ రుసుము చెల్లించి పీఈటీ చంద్రశేఖర్‌కి రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరములకు 9441734946, 7569183304 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-హాజీపూర్



ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని గుడిపేట ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తుందన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ఉద్యోగులకు క్విజ్ పోటీలు

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్టీపీపీ పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లోన్న ఉద్యోగులను ఆరు బృందాలుగా విభజించిన ఆయన వివిధ అంశాలపై ఉద్యోగులను స్వయంగా ప్రశ్నించారు. కాగా క్విజ్ పోటీల్లో పాల్గొని గెలుపొందిన ఉద్యోగులకు డిసెంబర్ 23న సింగరేణి వ్యాప్తంగా నిర్వహించుకోనున్న ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

యాసంగి పంటకు నీరందిస్తాం



నవతెలంగాణ-జన్నారం

కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతులకు యాసంగి పంటకు సరైన సమయంలోనే నీరు అందిస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు రాజశేఖర్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల రోజుల క్రితమే ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కడెం నీటి విడుదలపై క్లారిటీ ఇచ్చారన్నారు. కానీ అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు నీటిని విడుదలచేయాలని రాద్ధాంతరం చేయడం సరైనది కాదన్నారు. ఇప్పటికే కడెం ఆయకట్టు కింద ఉన్న చివరి పొలాలలో వరి కోతలు పూర్తి కాలేదు అన్నారు. కోసిన వరి పొలాల్లో వరిగడ్డి ఇంకా రైతుల ఇండ్లకు చేరలేదన్నారు. రైతుల పొలంపనులు ఇంకా పూర్తి కాకముందే ఇప్పుడు నీటి విడుదల చేస్తే నీరు వృథా అవుతుందన్నారు. రైతులకు కావలసినప్పుడు సరైన సమయంలోనే రైతుల అభిప్రాయాలు తీసుకొని కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేని మాటలు మాట్లాడుతూ, రాజకీయ ఉనికి కోసమే, రైతులపై ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తప్పకుండా రెండో పంటకు నీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు, ఇసాక్ ఫసియుల్లా, ఇందయ్యా ముత్యం సతీష్ లక్ష్మీనారాయణ, సుధాకర్ నాయక్ ఏపీఆర్, మత్స్య శంకరయ్య, నందు నాయక్, గంగన్న యాదవ్, దుర్గం గంగాధర్, కుమారస్వామి, గోపి సత్యనారాయణ, లక్ష్మి రాయ మల్లు గౌడ్, నరసయ్య పాల్గొన్నారు.

మంత్రి అమిత్ షా భేషరతుగా క్షమాపణలు చెప్పాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కేంద్ర హోమ్ శాఖ మంత్రి నిండు సభలో బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించి నందుకు భారత ప్రజలకు భే షరతుగా క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను విమర్శించినోళ్లంతా కాలాగర్భంలో కలిసి పోయారని, అంబేద్కర్ పేరు మాత్రం చరిత్రలో చిర స్థాయిగా నిలిచి పోతుందన్నారు. బీజేపీ నిరంతరం రాజ్యాంగంపై దాడిచేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కులను హరిస్తుందన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ ఇప్పటికైనా తమ అగ్రకుల బుద్ధి మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చి రాజ్యాంగంపై దాడి చేసి మనువాదాన్ని పున: ప్రతిష్ట చేయాలని చూడడం చాలా దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా బీజేపీ, అమిత్ షా బుద్ధి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మేకల బానేష్, కల్లేపల్లి విక్రమ్, పులి సునీల్, అల్లంపల్లి రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల కోసం తాత్కాలిక స్థలం కేటాయింపు



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పాత సీఎస్పీ ప్రాంతంలో బుధవారం మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల కోసం తాత్కాలికంగా స్థలాన్ని చదును చేసి కేటాయించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో తోపుడు బండ్ల వ్యాపారులు, పూల, పండ్ల వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది, సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత కమిషనర్ శ్రీనివాసరావు వ్యాపారులకు తాత్కాలికంగా నూతన కూరగాయల భవనం ఎదురుగా గల స్థలాన్ని చదును చేయించారు. చదును చేసిన స్థలాన్ని షాపులకు కేటాయించే విధంగా మార్కింగ్ చేశారు. సీఎస్ పి సమీపంలో నిర్మించిన షట్టర్లను రెండు రోజుల్లో తీసివేయాలని కోరారు. షట్టర్లు తీసివేసి సహకరించనట్లయితే మున్సిపల్ చట్టం ప్రకారం తొలగించి చిరు వ్యాపారులకు తాత్కాలికంగా కేటాయిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని జింకల పార్క్ వద్ద గల ప్రధాన రహదారిపై బుధవారం ఎస్సై రాజ వర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారుల వాహనపత్రాలు, డ్రైవింగ్ లెసెన్స్, ఇన్సూరెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరి ధరించాలని, వాహన పత్రాలు ఎల్లప్పుడు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌హెచ్-63 పనులకు బ్రేక్

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- రైతుల విన్నపాలు పట్టించుకోకపోవడాన్ని తప్పు పట్టిన ధర్మాసనం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెల నుంచి హాజీపూర్ మండలం ముల్కల్ల వరకు చేపడుతున్న నేషనల్ గ్రీన్ హైవే ఎన్‌హెచ్-63 రోడ్డు నిర్మాణం పనులు పూర్తిగా నిలిపివేయాలని మంగళవారం తెలంగాణ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ హైవే ఆక్ట్ సెక్షన్-3(సీ) ప్రకారం భూ నిర్వాసితుల అభిప్రయాలను పరిగణలోకి తీసుకోకుండా పనులు చేపట్టడం వల్ల వారికి తీరని అన్యాయం జరుగుతుందని హై కోర్టు అడ్వకేట్ దొరిశెట్టి పోచయ్య మంగళవారం హై కోర్టులో డబ్ల్యు పీ. నెం.35476/2024 దాఖలు చేసి వాదనలు వినిపించారు. నేషనల్ హైవే ఆక్ట్ సెక్షన్-3(సీ) భూ నిర్వాసితుల విన్నపాలను పరిగణలోకి తీసుకోకుండా పనులు చేపట్టడాన్ని ధర్మాసనం తప్పు పట్టింది. భూ నిర్వాసితుల వైపు నుండి హైకోర్టు న్యాయవాది దొరిశెట్టి పోచయ్య ధర్మాసనానికి వినిపించిన వాదనలు సబబేనని భావించిన జస్టిస్ వినోద్ కుమార్ నేషనల్ గ్రీన్ హైవే నిర్మాణం పనులను పూర్తిగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారని హైకోర్టు అడ్వకేట్ దొరిశెట్టి పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా లక్షటిపేట, హాజీపూర్ మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

హైకోర్టును ఆశ్రయించిన రైతులు

ఎన్‌హెచ్-63 కోసం అధికారులు మూడు దఫాలుగా రూట్మ్యాప్‌లో మార్పులు చేశారు. మొదటి రెండు అలైన్మెంట్స్ కూడా కొందరికి నష్టం కలుగుతుందని వారి ఒత్తిడికి తలొగ్గి అధికారులు మూడో రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. కొత్త అలైన్మెంట్‌తో జీవన ఆధారమైన సాగు భూములను సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ అలైన్మెంట్ ప్రకారం లక్షెట్టిపేట మండలం మీదుగా గోదావరి నదికి సమాంతరంగా పొలాల మీదుగా రహదారిని నిర్మించాల్సి ఉంటుంది. గతంలోనే ఈ ప్రాంతానికి చెందిన చాలామంది రైతులకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపునకు గురయ్యాయి. మిగిలిన కొంత వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మళ్లీ రహదారి కోసం భూములు సేకరిస్తూ ఉండటంతో వాళ్ల ఆందోళన చెందారు. తమకు నష్టం కలిగించే రూట్ మ్యాప్‌ను రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, పలువురు అధికారులను వివరించిన ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి-163 నిర్మాణంలో భూములు కోల్పోతున్న అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులకు సూచించారు. జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావుతో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆర్డీఓ పరిధిలో ఉన్న దరకాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్ రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలపై అసెంబ్లీలో చర్చించి వెంటనే ఇప్పించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణికి రావలసిన బకాయలపై అసెంబ్లీలో చర్చించి వెంటనే ఇప్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఆర్పీ-1 గనిపై ఫిట్ సెక్రెటరీ తొడే సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.30 వేల కోట్ల పైచిలుకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేసే విధంగా అసెంబ్లీలో ప్రకటన చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున కోల్ బెల్ట్ ప్రాంత ఎంపీలు పార్లమెంట్‌లో కూడా సింగరేణికి రావలసిన బకాయిలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. అంతే కాకుండా ఎన్నో రోజులుగా సొంతింటి కల, అలవెన్స్‌లపై ఐటీ మాఫీ, మారుపేర్లు, సీబీఎస్సీ సిలబస్ అంశాలపై సీఐటీయూ కల్పించిన అవగాహనతో ఎన్నికలలో అన్ని యూనియన్లు ఈ అంశాలపై మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. చివరకు కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి సైతం ఈ అంశాల మీద స్పందించి ఎలాంటి కార్యాచరణ చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, సిరికొండ శ్రీనివాస్, గోపాల్ రాథోడ్, నాంపల్లి సంపత్ పాల్గొన్నారు.

ఇటుక బట్టి కార్మికులను ఆదుకోవాలి

- ఐఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జయరావు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా పరిధిలో ఉన్నటువంటి ఇటుక బట్టి కార్మికులను అన్ని విధాలా ఆదుకొని సదుపాయాలు కల్పించాలని ఐఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జయరావు బుధవారం జిల్లా కేంద్రంలోని లెనిన్ భవన్‌లో ఇటుక బట్టిల్లో పని చేసే కార్మికులతో సమావేశం నిర్వహించారు. మంచిర్యాల ఏరియాలోని ఇటుక బట్టిలల్లో పని చేస్తున్న కార్మికులకు కూలీ రేట్లు పెంచక పోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎక్కడెక్కడినుండో కూలిలు వచ్చి ఇక్కడి ఇటుక బట్టీల్లో రాత్రి పగలు పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని గతంలో ఏర్పటు చేసిన కూలి రేట్ల అగ్రిమెంట్ గడువు ముగిసిపోవడంతో కొత్తగా రేట్ల పట్టిక రూపొందించి కూలీలకు సరిపడా జీత భత్యాలు అందించడంతో పాటు ఇటుక బట్టీల్లో పని చేస్తున్న బాల కార్మికులకు విముక్తి కలిగించి పిల్లలకు విద్య అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వెయ్యి ఇటుకలు తయారీకి రూ 1500, మోత కార్మికులకు 1000 ఇటుకలు రూ. 800 అందించి పని స్థలంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యమే పూర్తి బాధ్యత చేపట్టి, కార్మికులందరికి గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు పని స్థలాల్లో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నైనాల గోవర్ధన్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి, బ్రహ్మయ్య, రాములు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

సీఎం కప్-2024 పోటీలలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేసేదిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్ వీరు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతిలతో కలిసి హాజరై పరిశీలించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సీఎంకప్-2024 పోటీలను జిల్లాలో విజయవంతం చేసేదిశగా అధికారులు సమన్వయంతో కషి చేయాలని తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుండి జనవరి 2, 2025 వరకు రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలలో జిల్లా క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్య, ఉపాధి రంగాలలో క్రీడలకు ప్రత్యేక కోటా కేటాయించడం జరిగిందని, క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు విద్య, ఉపాధిలో రాణించేందుకు ఏకాగ్రత పెంపొందుతుందని, జీవితంలో ఎంచుకున్న ఉన్నత స్థానానికి ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.

రక్షణ చర్యలు మెరుగుపరచాలి



నవతెలంగాణ-నస్పూర్

దేశవ్యాప్త బొగ్గు గని కార్మికులకు రక్షణ చర్యలు మెరుగుపరచాలని బీఎంఎస్ జాతీయ నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు. 2 సంవత్సరాల తర్వాత స్టాండింగ్ కమిటీ ఆన్ సేఫ్టీ సమావేశం డిల్లీలో బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్త బొగ్గు గనులలో 80 మంది ఉద్యోగులు విధి నిర్వహణ గని ప్రమాదంలో మరణించారని, ప్రమాదాలను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపరిహారం పెంచాలని, మైనింగ్ ఏరియాల సరిహద్దులలో కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలని కోరారు. సీఎంపీఎఫ్ కుంభ కోణాన్ని సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని, పెన్షన్ ఫండ్ నష్టాల్లో పోకుండా చర్యలు వెంటనే చేపట్టాలని, మెరుగైన వైద్య సదుపాయం కోసం అన్ని కంపెనీలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, నివాసం కొరకు పాత క్వార్టర్స్ బదులు, నూతన నవికరణ క్వార్టర్స్ నిర్మించుటకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

టీపీఎల్ క్రికెట్ పోటీల్లో చెన్నై సూపర్ కింగ్ విజయం



నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన టీపీఎల్ క్రికెట్ పోటీల్లో చెన్నై సూపర్ కింగ్ విజయం సాధించింది. బుధవారం బహుమతుల ప్రధానోత్సవానికి సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్ కుమార్, సౌజన్య, మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి, నాథరీ స్వామి, ఎల్క రాంచందర్, శేషగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జీవితాన్ని దిశా నిర్దేశం చేసే యవ్వన దశలో యువత సన్మార్గంలో నడవాలని తెలిపారు. యువత క్రీడలు పుస్తక పఠనం యోగ వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ జీవిత లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రధానం చేశారు..

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-తాండూర్

టాస్క్ ఫోర్సు సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో కలిసి బెల్లంపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నాల బస్తీలో ఏలూరి రవి అనే వ్యక్తి ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.10,610 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బెల్లంపల్లి-1 టౌన్ పోలీస్ వారికి అప్పగించారు. పట్టుబడిన వారిలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఏలూరి. రవి, గడికొప్పుల భీమయ్య. ఎమ్‌ఏ నబీ, ఆరెపల్లి పోశం, చరణ్ ఉన్నట్టు తెలిపారు.

అనాథ పిల్లలకు సహకారం అందిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తల్లిదండ్రులు లేని పిల్లలకు పాఠశాల ఉందని ఇప్పటి వరకు తమకు తెలియదని, వారికి తమ వంతు సహకారం అందిస్తామని సాయిలింగి వృద్ధాశ్రమం ఉపాధ్యక్షుడు నాలం అనిల్ అన్నారు. బుధవారం బ్రహ్మణవాడలోని అర్బన్ రెసిడెన్షియల్ బ్రిడ్జి పాఠశాలలో సాయిలింగి వృద్ధాశ్రమంలో చలికాలం నేపథ్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అదే విధంగా గదుల ఓపెన్ కిటికిలకు మరమ్మత్తులు చేసేల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు లేని పిల్లలు చదువుకునే పాఠశాలలో సౌకర్యాలు కల్పించేలా తమవంతుగా సహకారం అందించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని సాయిలింగి వృద్ధాశ్రమం ఉపాధ్యక్షుడు నాలం అనిల్ అన్నారు. కార్యక్రమంలో అడ్వైజరి కమిటీ సభ్యుడు సురేష్ భాస్కర్, సొసైటి మేనేజర్ పసుపుల రాజు, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్, స్పెషల్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, అకౌంటెంట్ దత్తు పాల్గొన్నారు.

లోటుపాట్లు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయాలి : కలెక్టర్ వెంకటేష్

నవతెలంగాణ ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఇంటింట సర్వే పకడ్బందీగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి 500 ఇండ్లకు ఒక సర్వే అధికారిని నియమించడం జరిగిందని, నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఓరియంట్ కంపెనీ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 4370 శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. దేవాపూర్ ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ చేతుల మీదుగా దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 550 శానిటరీ ప్యాడ్స్, బాలికల ఆశ్రమ పాఠశాలలో 1420, డీఏవీ పాఠశాలలో 2400, మొత్తం 4370 శానిటరీ ప్యాడ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, ఏటీఎం హెచ్ఆర్ ఉమా శంకర్, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు

నవతెలంగాణ-తాండూర్



ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని మాదారం టౌన్షిప్ ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.7 లక్షలు ఉపాధి హామీ నిధులతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ డెవలప్మెంట్ ట్రక్చర్‌లో భాగంగా పాఠశాలల మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ వంటశాలల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఏపీఓ నందకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ అరుణ్, మాజీ సింగల్ విండో వైస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సెక్రెటరీ సౌందర్య తాజా మాజీ వార్డు సభ్యులు కుష్ణ పెళ్లి లక్ష్మణ్, గొల్లపల్లి బానేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోట శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్, షేక్ మోమిన్ అలీ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలకు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల సాధనకై 010 పద్దు ద్వారా తమకు వేతనాలు అందజేయాలని కోరారు. ఆర్థిక శాఖలో 010కి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉన్న కారణంగా ప్రభుత్వం త్వరగా స్పందించి వెంటనే జీఓ విడుదల చేయాలని, లేనిచో నిరసనలు కొనసాగుతాయని మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్



విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించడం కోసం కష్టపడాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం బంగారు భవిష్యత్తుకు బాటలు వేదాం అనే నినాదంతో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు ఎల్లపుడు దూరంగా ఉండి తమ లక్ష్యాల వేటలో ఉండాలన్నారు. కొన్ని అనుకోని సందర్భలలో మానసిక స్థితి బాగా లేక అలవాటైన చెడు వ్యసనాలు కుటుంబాలనే నాశనం చేసే విధంగా మారవుతాయనే విషయాన్ని యువత, విద్యార్థులు గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చెవుటు మల్లేష్ పాల్గొన్నారు.

21న గోలేటిలో వెల్ బేబీ షో

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరిలో వెల్ బేబీ షో నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగి నాలుగేండ్లలోపు చిన్నారులను(కొడుకులు, కూతుర్లు, మనుమలు, మనుమరాళ్లు) మాత్రమే షోలో అనుమతిస్తామన్నారు. షోలో పాల్గొనే వారు ఉద్యోగి గుర్తింపు కార్డు, ఉద్యోగి ఆస్పత్రి బుక్, బేబీ డేట్ ఆఫ్ బర్త్, బేబీ ఇమ్యునైజేషన్ కార్డుతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం ఈ విషయమై సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాను కలిసి వినతిపత్రం అందించారు. 6 కిలోమీటర్ల పరిధిలో గల గ్రామాలను కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని, మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారిందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూములు, రోడ్లు, ట్రాఫిక్‌తో పాటు పలు సమస్యపై సబ్ కలెక్టర్‌కు విన్నవించామని దీనిపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాల్క శ్యామ్, శివకుమార్ నాయర్, అరుణ్ లోయ పాల్గొన్నారు.

గ్రంథాలయ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రంథాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా నాయకులు సలీం డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.60 వేతనం నుండి పనిచేస్తున్న గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. నిత్యావసర ధరలు పెరిగి అతి తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు కనీస వేతనం రూ.15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, రాజారాం, అశోక్, సురేష్, ప్రేంసాగర్, బూదన్న, రాజన్న, అరుణ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-నస్పూర్



ఆదిలాబాద్‌టౌన్ : ధూంధాం నిర్వహిస్తున్న కళాకారులు

సమగ్ర శిక్ష ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి తరపున మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి వారి స్థాయిలో కృషి చేస్తున్నారని, దాని మూలంగానే ఈ రోజు కేజీబీవీల్లో మంచి ర్యాంకులతో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారన్నారు. అదేవిధంగా విద్యాశాఖలోనే మిగతా డిపార్ట్మెంట్లో కూడా వారి కృషి ఉందని, కానీ వారు 15, 20 సంవత్సరాల నుంచి ఉద్యోగాలు చేస్తున్న ప్రభుత్వాలు మారినప్పటికీ రెగ్యులరైజ్ చేయలేదన్నారు. అదేవిధంగా జీవిత బీమా, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇలాంటి ఏవి కూడా వర్తించడం లేదని, గత సంవత్సరం ఇవే డిమాండ్స్ తోటి సమ్మె చేస్తుండగా ప్రస్తుత ముఖ్యమంత్రి సమ్మె శిబిరం దగ్గరికి వెళ్లి మీ డిమాండ్స్ న్యాయమైనవి పది నిమిషాల్లో పరిష్కరించదగినవని చెప్పడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 100 రోజులలోపే పిలిచి సమస్యలన్నీ పరిష్కారం చేస్తానని చెప్పి ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం గడిచిన ఇంతవరకు సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. సమ్మె చేయడం 9 రోజులు గడుస్తున్నా కూడా చర్చలకు పిలవకపోవడం బాధాకరం, ఇప్పటికైనా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మంజునాథ్, నిఖిల్, అక్షయ్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆటాపాటలతో ధూంధాం..

సమ్మెకు కళాకారుల సంఘీభావం

ఆదిలాబాద్‌టౌన్ : కలెక్టరేట్ ఎదుట సమగ్రమైన శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం నాటికి ఈ సమ్మె తొమ్మిదవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ధూమ్‌ధాం కళాకారులు తమ సంఘీభావ ప్రకటించారు. ఏ.అశోక్ ఆధ్వర్యంలో కళాకారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ కళా ప్రదర్శనతో ఉద్యోగులను ఉత్తేజపరిచారు. చాలీచాలని వేతనాలతో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను పాటల రూపంలో వ్యక్తపరిచారు. సీఎం వెంటనే స్పందించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాకారులు లక్ష్మణ్ ఆశన్న, దత్తు, కబీర్‌దాస్, విలాస్, అశోక్ పాల్గొన్నారు. అలాగే దీక్షలకు ఏంఈఓ కంటె నర్సయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న చేపట్టిన చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని మున్సిపాలిటీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పెరిక శ్రీకాంత్ కోరారు. మునిసిపాలిటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వీటితో పాటు ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా కోసం చేపట్టే చలో హైదరాబాద్‌కు జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని కోరారు. ఇతర ఉద్యోగస్తుల ప్రభుత్వ ప్రత్యేక గ్రాండ్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని, కార్మికులు చనిపోతే తక్షణమే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆదేశాలున్న చాలా మున్సిపాలిటీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి ఒకటో తారీకు వేతనాలు చెల్లిస్తున్నామని పదేపదే చెప్తున్నారని, ప్రజలకు నిరంతరం ఉదయం నుంచి రాత్రి వరకు ఇటువంటి విపత్కర పరిస్థితి ఎదుర్కొని సేవ చేస్తున్న తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్క్ వద్ద ఈనెల 21న చేపట్టే ధర్నా చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని కోరారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు సీహెచ్ శంకర్, శ్రీనివాస్, నక్క మల్లేష్, రాజు, దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులు ఎం.పద్మ, పెంటు బాయి, ప్రభాకర్ పాల్గొన్నారు.

27న జీఎం కార్యాయం ముట్టడి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై ఈనెల 23న స్పష్టమైన ప్రకటన చేయకుంటే ఈనెల 27న జీఎం కార్యాలయం ముట్టడిస్తామని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం గోలేటిలోని తెలంగాణ భవన్‌లో సంఘం బెల్లంపల్లి ఏరియా కమిటీ సమావేశం అంబాల ఓదెలు అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ఆయనతో పాటు టీబీజీకేఎస్ ఏరియా నాయకులు మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచకుండా సింగరేణి యాజమాన్యం కార్మికుల జీవితాలతో చలగాటమాడుతుందని ఆరోపించారు. ఈనెల 23న సింగరేణి ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా జరుపుకొని బొగ్గు ఉత్పత్తిలో టార్గెట్ సాధించామని సంబరాలు జరుపుకుంటున్న సింగరేణి ఆ ఉత్పత్తికి కారకులైన కాంట్రాక్ట్ కార్మికులను మర్చిపోవడం వివక్షతకు గురి చేయటం సిగ్గుచేటన్నారు. సింగరేణి ఆవిర్భావ దినమైన 23న రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం జీతాల పెరుగుదలపై స్పష్టమైన ప్రకటన చేయని పక్షంలో 27న జీం ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జనరేటర్ ఐ.ధన్ రాజ్, ఉపాధ్యక్షులు విజయ్, సహకారదర్శి వెంకట చారి, కోశాధికారి ప్రవీణ్ కుమార్, ఆర్గనైసింగ్ సెక్రెటరీలు గోపాల్, రాజన్న, నక్క ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : మాల సంఘం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గ్లోబల్ మాదిగ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆదిలాబాద్ మాల సంఘం తీవ్రంగ ఖండిస్తున్నామని మాల సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒకే కులానికి అంటే మాదిగ కులానికి మద్దతు ప్రకటించడం సరైనది కాదన్నారు. దళిత జాతికి సంబంధించిన అన్ని కులాలకు సరైన న్యాయాన్ని జరిగేలా ముఖ్యమంత్రి ఆలోచించాలన్నారు. అలాగే పార్లమెంట్ సమావేశంలో హోంమంత్రి అమిత్ షా బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తాను మాట్లాడిన మాటను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో బీజేపీ తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, మెట్టు ప్రహ్లాద్, సింగర్ అశోక్, పాశం రాఘవేంద్ర, మల్లన్న ఉన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్జీఎఫ్ అండర్-17 నెట్ బాల్ జాతీయస్థాయి పోటీలలో ప్రతిభ చాటింది. ప్రిన్సిపాల్ మహేశ్వర్ మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి పుల్గం అర్చన ఈనెల 10 నుండి 14 వరకు పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరిగిన జరిగిన నెట్ బాల్ క్రీడల్లో గోల్ అటకర్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థినిని ఎస్జీఎఫ్ సెక్రెటరీ బి.వెంకటేశం, ఫిజికల్ డైరెక్టర్ బి.తిరుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

బోథ్ : కేంద్ర క్రీడా శాఖ మంత్రి మాన్సుక్ మాండవీయను ఎంపీ గోడం నగేష్ బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించాలని, ప్రత్యేకంగా జిల్లాలో హాకీ కోర్టుకు సింథెటిక్ టర్ఫ్ మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి త్వరలోనే అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

సీహెచ్‌సీలో మెనూ పాటించడం లేదు

కాగజ్‌నగర్ : పట్టణంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనంలో మెనూను పాటించడం లేదని ఆర్‌టీఐ యాక్టివిటర్ ఎండీ అజీం అన్నారు. బుధవారం ఇదే విషయమై సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాను కలిసి వినతిపత్రం అందించారు. సీహెచ్‌సీలో ప్రతి రోజు టిఫిన్, భోజనం మెనూ ప్రకారం ఇవ్వడం లేదన్నారు. ఇదే విషయాన్ని వైద్య సిబ్బందిని ఆరా తీస్తే దురుసుగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. రోగులకు పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించేల చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆడే గజేందర్‌ను కలిసిన గ్రామస్తులు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తేజాపూర్ రెడ్డి సంఘ సభ్యులు బుధవారం మర్యాదపూర్వం కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించారు. రెడ్డి ఫంక్షన్ హాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని విన్నవించారు. దీనికి స్పందిస్తూ వెంటనే పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆర్పీల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి అన్నారు. బుధవారం ఆర్పీలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్పీల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి మాట్లాడుతూ ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను సైతం విడుదల చేయాలన్నారు. రూ. పది లక్షల ప్రమాద భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఆర్పీల సంఘం అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి ధనలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ఫరిద, కోశాధికారి రేవతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని బొంబాయిగూడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయుడు జాఫర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిషత్ కార్యాలయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విద్యార్థులకు కార్యాలయాల్లో చేసే పనులను వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అల్బర్ట్ విద్యార్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యాలయంలో సిబ్బంది పని చేస్తారని, గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే సంబంధిత అధికారికి తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ప్రకాష్, ఏఎస్ఎం భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా ఎంవీటీసీ తనిఖీ

నవతెలంగాణ-రెబ్బెన



గోలేటిలోని ఎంవీటీసీ వద్ద 55వ రక్షణ పక్షోత్సవాలను బుధవారం నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, కొత్తగూడెం జీఎం జీవీ కోటిరెడ్డి సారథ్యంలో రక్షణ తనిఖీ బృందం ఎంవీటీసీని పరిశీలించారు. ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ వివరాలను తెలుసుకున్నారు. తరగతులకు హాజరైన ఒప్పంద, సింగరేణి ఉద్యోగులను రక్షణ చర్యలపై ప్రశ్నలు అడిగారు. సమాధానాలు చెప్పిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఇంటినుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కే.రాజమల్లు, డిప్యూటి జీఎం ఈఅండ్ఎం జి సంబంధం, డిప్యూటి జీఎం ఎంవీటీసీ వీఎస్ ఇందా, డిప్యూటి ఎస్ఈ రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు ప్రమాదం ద్వారా ఒక వ్యక్తి మరణానికి కారణమైన నిందితునికి సంవత్సరం జైలుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి తీర్పు ఇచ్చారు. డీఎస్పీ తెలిపిన వివరాలు ప్రచారం 2019 సెప్టెంబర్ 30న రాత్రి 11:30కు కాగజ్ నగర్ వెళ్లి తిరిగి ఆసిఫాబాద్‌కు వస్తున్న జిల్లా కేంద్రంలోని బజారువాడకు చెందిన పడిగెల విజయ్ కుమార్‌ను రెబ్బెన మండలం ఖైర్‌గాంకు చెందిన మనం విజయ్ అతివేగంగా కార్‌లో వచ్చి ఢీకొట్టగా విజయ్ కుమార్ అక్కడికక్కడే మరణించారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో సాక్షాలను ప్రవేశపెట్టగా జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు నిరూపితం కావడానికి వృషి చేసిన సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ-ఉట్నూర్



ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు చేపట్టిన సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరుకోగా పీఆర్టీయూ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. రాష్ట్ర నాయకుల సహాయ సహకారాలతో ఆశ్రమ పాఠశాల సీఆర్టీల సమస్యలను పరిష్కరించే విధంగా తమ వంతు సహకారాలు అందిస్తామని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమాన అన్నారు. ఈ సందర్భంగా సీఆర్టీలకు సంఘం తరపున భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మినిమం టైం స్కేల్ వర్తింపచేసి, ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి మోహన్ సింగ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆడే నూర్ సింగ్, నవీన్, ప్రకాష్, సునీల్, రవీందర్, లక్ష్మణ్ ఉన్నారు.

సీఆర్టీల సమ్మెతో తీవ్ర ప్రభావం

నవతెలంగాణ-నేరడిగొండ



సీఆర్టీలు సమ్మె చేస్తున్న కారణంగా పాఠశాలలు మూతపడడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాధవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఆర్టీలు రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్, ఇతర హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్నారన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దాని కారణంగా పేద విద్యార్థులకు చదువు లభించడం లేదని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడే స్థితికి వస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారితో సమానంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన లైవ్ మండల అధ్యక్షుడు రాథోడ్ సందీప్, జిల్లా ఇన్‌చార్జి రాథోడ్ ఫాండు, ఆడే వసంత్ ఉన్నారు.